

చెహోవ్ కథ



# వృద్ధాశ్రమంలో

రష్యన్‌మూలం: చెహోవ్
తెలుగు గొంతు: కరుణారుణ

ప్రతీ శనివారం సాయంత్రం సాషా తల్లితో కలిసి వృద్ధాశ్రమానికి వెడుతుంది. చిరిగిన ఫ్రాకూ, అరిగిన బూట్లూ, జబ్బుగా వున్న తల్లీ. ఆ చిన్నపిల్లకు యివన్నీ యిలా ఎందుకున్నాయో తెలియదు.

వృద్ధాశ్రమంలో ఆమె తాత సార్ఫెనీ వుంటాడు. తాత వుండే గదేమీ బావుండదు. గోడల మీద ఆడవాళ్ల బొమ్మలు. దుర్వాసన. మూలల్లో సాలెగూళ్లు. నేలమీద తినగా కిందపడిన రొట్టె ముక్కలు. దగ్గిరగా కూర్చుంటే భరించలేని నశ్యం ఘాటు.... తాతయ్యది బోసి నోరు. ఎప్పుడూ తెరిచే వుంటుంది.

గదిలోకి ప్రవేశించగానే 'ఎలా వున్నాడే మీ నాన్న' అంటో అడుగుతాడు తాతయ్య.

సాషా మాట్లాడదు.

తల్లి కన్నీళ్లు తుడుచుకుంటూ, 'ఇంకా ఆర్కెస్ట్రా వాయిస్తూ హోటళ్ల చుట్టూ తిరుగుతున్నాడా? ఒసేవ్, వాడు మీ అమ్మను చేసుకున్నప్పుడే తెలిసింది. వాడెంత మూర్ఖుడు. మా వంశ గౌరవాన్ని మంటగలిపి మీ అమ్మలాంటి నాటకాల మనిషిని కట్టుకున్నాడు. మీ అమ్మ తండ్రి మా పాలేరు, తెలిసిందా.' అంటూ చెబుతాడు తాతయ్య.

ఏం చెయ్యాలో తోచక సోషా కూడా ఏడుస్తుంది. ఓ మనిషి సమోవార్‌లో నీళ్లు తీసుకొస్తాడు. సార్ఫెనీ అందులో కాసింత టీపొడి వేసి మరగబెడతాడు.

నిశ్శబ్దం అంతటా వ్యాపిస్తుంది.

'రండి, టీ తాగుదాం' అంటాడు కప్పుల్లో పోస్తూ.

టీ రుచి బావుండదు. డోకొచ్చినట్టవుతుంది. కానీ తాగకపోతే తాతయ్యేమనుకుంటాడో. టీ తర్వాత, సార్ఫెనీ మనవరాల్ని ఒళ్లో కూర్చోపెట్టుకుని. 'ఒసేవ్, నీది చాలా గొప్పవంశం. ఇప్పటికైనా తెలుసుకో. మనం నాటకాల వాళ్లం కాము. ఇప్పుడు నాకు ఆస్తి లేనంత మాత్రాన మన ప్రతిష్ట ఏం తగ్గిపోలేదు. మీనాన్న నాటకాలవాళ్లతో, ఆర్కెస్ట్రా వాళ్లతో తిరిగి మన గౌరవం బజారుపాలు చేశాడుగాని మనది గొప్ప వంశం. మా చిన్నప్పుడు ఎలా వుండేవాళ్లమో తెలుసా...' అంటూ ఎముకలు తేలిన చేతులతో తల నిమురుతూ తాతయ్యతో చెబుతాడు.

'మా ఇలాకాలో మా ముగ్గురికీ తిరుగులేదు. ఒకడు చిన్న రాజావారు. మరొకరు గవర్నరు. నేను, నాకు ఆస్తి తక్కువగా వుండేది కాదనుకో కేవలం ఓ అయిదువేల ఎకరాలు భూమీ, ఓ ఆరువందల మంది పాలేర్లూ, కూలీలూ. ఎంత ఖ్యాతిగా బతికామనుకున్నావు. అంతదూరంలో నేను కనిపిస్తే చాలు. జనం హడలిపోయేవాళ్లు.

నా మాటను ధిక్కరిస్తే ఎలాంటెలాంటి శిక్షలు వేసే వాళ్లనుకున్నావు! గులకరాళ్ల మీద మోకాళ్లతో నడిపించేవాణ్ణి ఆడవాళ్లను గూడా. ఎవరికి తగిన శిక్ష వాళ్లకు వెయ్యాలా లేదా ఏమంటావు? అలాగే, విధేయత చూపిస్తే నజరానాలూ ఇచ్చేవాణ్ణి. నన్నే నమ్ముకుంటే ధైర్యసాహసాలు ప్రదర్శిస్తే వయసు మళ్లిన వాళ్లకైనా వడుచు పిల్లల్నిచ్చి పెళ్లి చేసేవాణ్ణి.'

'జల్సా అంటే ఏమిటో ఈ తరం వాళ్లు వూహించనైనా లేరు. అలాంటి జల్సాలు చేసుకునేవాళ్లం. నా దర్బారులో ఎంతమంది పాటలు పాడేవాళ్లూ, డాన్సర్లూ వుండేవాళ్లో! భోజనాల దగ్గిర ఎంత తిండో. ఎన్ని రకాల మాంసాలు. ఎన్ని రకాల మద్యాలు. నన్ను ఆకర్షించడానికి ఎంతమంది ఆడవాళ్లు ఎన్ని ప్రయత్నాలు చేసేవాళ్లు..... ఎన్ని శిక్షలు వేశానో. ఎంతమందిని దగ్గరకు తీసుకున్నానో. నా ఇష్టమే ఇష్టం. నాకు తోచిందే న్యాయం. నా మాటకు ఎదురు లేదు....'

భయంతో వణికిపోతూ ఒక్క గెంతులో తల్లి దగ్గిరకు వస్తుంది సాషా.

'అమ్మ, వెళ్లి పోదాం. నేనిక్కడుండలేను.'

'ఎందుకే భయం. ఇలా రావే పిల్లా' అంటాడు తాత.

'దానికి జ్వరం వచ్చినట్టుగా వుంది. ఇక వెళతాం' అంటుంది తల్లి.

బయల్దేరేముందు సాషా తల్లి వెళ్లి తాత చెవిలో ఏదో చెబుతుంది.

'మీకొక్క కోపెక్కు కూడా యిచ్చేది లేదు. దాని తండ్రిని సంపాదించి తెమ్మను. వచ్చినప్పుడల్లా నేనేమో మీకు డబ్బులివ్వాలీ. వాడేమో నీవంటి పిసినారి ముందు చెయ్యిచాపటం కంటే రోడ్డుమీద ముష్టెత్తుకోవటమే నయం అంటూ ఉత్తరాలు రాస్తాడా! నేను, కన్న తండ్రినే వాడికి కనిపించకుండా పోయానా!'

'మీ రక్తం పంచుకు పుట్టిన కొడుకు. ఆయన మీద అంత కోపం తెచ్చుకుంటే ఎలా?' అంటుంది తల్లి.

తాతయ్య కోపం తగ్గదు. తల్లి ప్రాధేయపడుతూనే వుంటుంది. చివరికి తాతయ్య తిట్టుకుంటూ వుమ్మేస్తూ, కోపంగా, ఓ పచ్చనోటు తీసి తల్లివైపు విసిరేస్తాడు.

తల్లి దాన్ని తీసుకొని, కళ్లకద్దుకొని వస్తుంది. 'అమ్మా, నన్నింకెప్పుడూ తాతయ్య దగ్గిరకు తీసుకురావద్దు. ఆయన్ను చూస్తే నాకు భయం' అంటుంది సాషా.

'అలా అంటే మనకు రోజులెలా గడుస్తాయమ్మా. నా తల్లికదూ! మీ నాన్నేమీ సంపాదించడాయె. పైగా తాగుబోతు. మరి మనం ఒక్క పూటన్నా తినకపోతే ఎలాగే

'నాన్న ఎందుకు తాగుతాడమ్మా?' అని అడుగుతుంది సాషా.

'మనసు బాగుండకపోతే మగాళ్లు తాగుతారు. మనం తాతయ్య దగ్గరకు వెడతామని నాన్నకు చెప్పొద్దేం. నాన్నకు కోపం వస్తుంది. కోపం వస్తే దగ్గెక్కువవుతుంది. మీ నాన్న చాలా ఆత్మ గౌరవం గల మనిషి. ఎవరి దగ్గిరైనా సరే, మనం ఇలా అడుక్కోవడం ఆయనకిష్టం వుండదు. చెప్పొద్దేం.' అంటుంది తల్లి. ■



## హీరో ఎవరైతేనేం?

బాలీవుడ్ నిర్మాత వాశూభగ్నానీ చిత్రంలో అవకాశమిస్తే కరీనాకపూర్ చేయనందట. అట్లాంటి మంచి నిర్మాత చిత్రంలో పని చేయటం కోసం జనం తహతహలాడుతుంటారు. అందులో హీరో అర్జున్ రామ్‌పాల్. కొత్తవాడు కనుక వద్దందేమో! దానికి సమాధానంగా కరీన, "ప్రతి ఆరు నెలలకూ నాకూ, అర్జున్‌కూ ఏవో గొడవలున్నాయని రాసేస్తుంటారు. నాకతనితో ఎలాంటి సమస్యలూ లేవు. వరల్డ్ స్టేజ్ టూర్ సందర్భంలో మేము హాయిగా మంచి మిత్రుల్లా గడిపాము. నేనే చిత్రాన్నైనా వద్దనుకుంటే డబ్బు తక్కువ కావటమే కానీ మరో కారణం ఏదీ వుండదు. అయినా నా వేషం బాగుండాలి కానీ, హీరో ఎవరైతేనేం?" అంది. రాజ్‌కపూర్ మనవరాలికి డబ్బు మీద ఇంతిది వుందా?

ఎస్.